ప్రజాశక్తి
www.prajasakti.com
I

ఆర్‌టిసి చైర్మన్‌ను కలిసిన జెడి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

టిఎస్ ఆర్‌టిసిలో ఇటీవల విజిలెన్స్ విభాగం జాయింట్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సంగ్రామ్‌సింగ్ పాటిల్ బుధవారం చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిశారు. ఈ సందర్భంగా చైర్మెన్ ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విసి సజ్జనార్‌తో కలిసి పలు అంశాలపై చర్చించారు.

ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలి

- హెచ్‌యుజె డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై రాష్ట్ర ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యుజె) డిమాండ్ చేసింది. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా తగిన విధానంతో ప్రభుత్వం ముందుకు రావాలని కోరింది. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో బుధవారం హెచ్‌యుజె జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హెచ్‌యుజె అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ కుమార్, జగదీశ్వర్ మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చినప్పటి నుంచి ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం నాన్చుడు ధోరణిని అవలంభిస్తోందన్నారు. కోర్టు అడ్డంకులు తొలగిపోవడంతో... ఈసారి ప్రభుత్వం సానుకూలం నిర్ణయం వెంటనే తీసుకోవాలని కోరారు. జర్నలిస్టుల హెల్త్ కార్డుల విషయంలోనూ ప్రభుత్వం స్పష్టతనివ్వాలన్నారు. బడ్జెట్‌లో ఉద్యోగులకు కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసి, ప్రత్యేక విధివిధానాలు రూపొందిస్తామని చెప్పారని.. దీంట్లో జర్నలిస్టుల అంశాలన్ని చేర్చాలేదన్నారు. ఎన్నో ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం జర్నలిస్టులు పోరాడుతున్నారన్నారు. ప్రభుత్వం దృష్టికి అనేకసార్లు తీసుకువెళ్లామని, ఇప్పుడైనా తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో హెచ్‌యుజె నాయకులు నవీన్, రాజశేఖర్, నాగమణి, దామోదర్, రమేష్, సర్వేశ్వర్, రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, పద్మరాజు, విజయానంద్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగానే కార్మికుల వేతనాలు పెంపు

- సమస్యల పరిష్కారం కోసం మార్చి 13న కలెక్టరేట్ల ముట్టడి
- మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల యూనియన్ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచిందని మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల యూనియన్ పేర్కొంది. పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల 13న కలెక్టరేట్లను ముట్టడించాలని పిలుపునిచ్చింది. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టి చక్రపాణి అధ్యక్షతన రాష్ట్ర విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి రమ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై ప్రభుత్వం చొరవ తీసుకోకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. గత ఎనిమిదేళ్లుగా ఒక్క సమస్యనూ పరిష్కరించలేదని విమర్శించారు. నిరంతరం పోరాటాల మూలంగానే రాష్ట్ర ప్రభుత్వం రూ. 2000 పెంచుతూ జిఒ నెంబర్ 8ని విడుదల చేసిందని తెలిపారు. ఆ జిఒను 2022 మార్చిలో ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు వేతనాలను అమలు చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ఇచ్చిందని, కేంద్ర ప్రభుత్వం వాటా పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు ఇందూరి సులోచన, దాసరి కళావతి, సిహెచ్ ప్రవీణ్ కుమార్, సత్యనారాయణ, పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక క్షేత్రంగా కొండగట్టు

- వేలాది మంది ఒకేసారి దీక్ష విరమించేలా వసతులు
- ప్రమాదాలకు తావులేకుండా ఘాట్‌రోడ్డు నిర్మాణానికి సూచనలు
- 25 ఏళ్ల తరువాత తొలిసారి దర్శించుకున్న సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ప్రపంచాన్నే ఆకర్షించే ఆధ్యాత్మిక క్షేత్రంగా కొండగట్టు అంజన్న కేంద్రాన్ని రూపుదిద్దుతాం.. దేశంలో అతిపెద్ద హనుమాన్ క్షేత్రం ఎక్కడ ఉందంటే కొండగట్టు పేరు తలుచుకునేలా మారుస్తాం. మరో రూ.500 కోట్లు మంజూరు చేస్తాం. వేలాది మంది ఒకేసారి దీక్ష విరమింపజేసేలా వసతులు కల్పిస్తాం. 850 ఎకరాల్లో ఆలయ విస్తరణ, అభివృద్ధి చేపడుతాం. సువిశాలమైన పార్కింగ్ కోసం 86 ఎకరాలు కేటాయిస్తాం. ప్రమాదాలకు తావులేకుండా ఘాట్‌రోడ్డు నిర్మాణం సహా పుష్కరిణీ, అన్నదాన సత్రం, కళ్యాణ కట్ట, పుష్కరిణిని అభివృద్ధి చేస్తాం' అని ముఖ్యమంత్రి కెసిఆర్ కొండగట్టు అంజన్నక్షేత్ర అభివృద్ధిపై మాట్లాడారు. రెండున్నర దశాబ్దాల తరువాత జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటలోని ఈ క్షేత్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. పరిసరాలను పరిశీలించారు. హెలికాప్టర్ ద్వారా కొండగట్టు ప్రాంతాన్ని వీక్షించారు. ఆలయ విస్తరణకు సేకరించాల్సిన భూములు, సంబంధించిన అంశాలపై లొకేషన్ మ్యాపుతో పూర్తిగా పరిశీలించారు. అనంతరం మంత్రులు, ఉన్నతాధికారులతో

లొకేషన్ మ్యాపును పరిశీలిస్తున్న సిఎం కెసిఆర్

రెండుగంటలకుపైగా సమీక్షించారు. యాదాద్రి తరహాలో కొండగట్టు అంజన్న క్షేత్రాన్ని రూపుదిద్దుతామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ మృహత్తర ప్రాజెక్టు కోసం మొత్తంగా రూ.600కోట్లు ఖర్చు చేస్తామని తెలిపారు. పక్షం రోజుల కిందటే రూ. వంద కోట్లు మంజూరు చేసిన సిఎం.. మరో రూ.500కోట్లు ఇస్తామని చెప్పారు. కొండగట్టుపైకి ఘాట్‌రోడ్డును ఎలాంటి ప్రమాదాలకూ తావులేకుండా పునరుద్ధరించాలన్నారు. నిధులకు ఎలాంటి కొరతా లేదని, అవసరమైతే రూ.వెయ్యి కోట్లు కేటాయించేందుకు సైతం సిద్ధంగా ఉన్నామని చెప్పారు. యాదగిరిగుట్ట ఆలయ నిర్మాణం సమయంలో చేపట్టిన సూక్ష్మ పరిశీలన, విస్తృతస్థాయి సమావేశాల మాదిరి అంజన్న ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పనులూ చేపడతామని చెప్పారు. ఏటా లక్షలాది మంది దీక్ష చేపడతారని, వారికి అన్ని సౌకర్యాలతో కూడిన వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ నిర్మాణానికి సంబంధించి శిల్పులను సమకూర్చాలని ఆర్కిటెక్ట్ ఆనంద్ సాయికి సూచించారు. సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, జెడ్‌పి చైర్‌పర్సన్ దావా వసంత, ప్రభుత్వ చీఫ్‌విప్ భాను ప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యేలు సుంకే రవిశంకర్, డాక్టర్ సంజయ్ కుమార్, రసమయి బాలకిషన్, బాల్క సుమన్, జీవన్ రెడ్డి, సిఎంఒ కార్యదర్శి స్మితా సబర్వాల్ సహా దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కోమటిరెడ్డిది అబద్ధపు ప్రచారం

- మీడియా సంస్థలపై ఐటి దాడులు ప్రజాస్వామ్య విరుద్ధం
- తెలంగాణలో ముందస్తు ఎన్నికలు రావు
- చిట్‌చాట్‌లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో హంగ్ వస్తోందని భువనగిరి ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అబద్ధపు ప్రచారం చేస్తున్నారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. బిబిసి మీడియా సంస్థలపైన ఐటీ దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అభిప్రాయపడ్డారు. మీడియాను అణచివేతకు గురిచేయాలనే కేంద్రం ఆలోచన సరైంది కాదన్నారు. తెలంగాణ బడ్జెట్ సమావేశాలు సజావుగా సాగాయని తెలిపారు. దేశంలో, రాష్ట్రాల్లో నెలకొన్న తాజా పరిస్థితిపై సిఎం కెసిఆర్ ప్రసంగంలో సమగ్ర సమాచారం లభించిందన్నారు. సామాన్య ప్రజలకు అర్థమయ్యే విధంగా సిఎం దేశంలో నెలకొన్న పరిస్థితులను వివరించారని చెప్పారు. రాష్ట్రంలో అద్భుతమైన పథకాల అమలు చేస్తున్న ఘనత కెసిఆర్‌కే దక్కిందన్నారు. సెస్సుల పేరుతో రాష్టం నుంచి రూ.20 లక్షల కోట్లు వసూలు చేసిన కేంద్ర ప్రభుత్వం.. నిధుల విడుదలలో రాష్ట్రంపై వివక్ష చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ మెజారిటీతో తెలంగాణలో మళ్లీ బిఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందన్నారు. ముందస్తు ఎన్నికలు రావని, షెడ్యూల్ ప్రకారమే రాష్ట్రంలో ఎన్నికలు ఉంటాయని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో వామపక్షాలతో పొత్తు ఉంటుందని భావిస్తున్నానన్నారు. పార్టీ నిర్ణయం ప్రకారమే తన కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డి పొలిటికల్ స్టెప్ ఉంటుందని చెప్పారు. బండి సంజయ్ వ్యాఖ్యలు ఆయన పార్టీ నేతలకే వర్తిస్తాయని, బిజెపి నేతలు దండుపాళ్యం బ్యాచ్‌లా తయారయ్యారని విమర్శించారు.

మాస్టర్స్ గేమ్‌లో ఆర్‌టిసి ఉద్యోగుల సత్తా

- అభినందనలు తెలిపిన ఎండి విసి సజ్జనార్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఇటీవల జరిగిన 5వ ఆలిండియా మాస్టర్స్ గేమ్స్‌లో టిఎస్‌ఆర్‌టిసి ఉద్యోగులు సత్తా చాటారు. సంస్థకు చెందిన ముగ్గురు ఉద్యోగులు ఆరు పతకాలను సాధించారు. వీరిని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విసి సజ్జనార్ అభినందించారు. స్విమ్మింగ్ 50 మీటర్ల విభాగంలో కె శ్రీనివాస్ రెండు బంగారు పతకాలు, 100 మీటర్ల విభాగంలో ఒక సిల్వర్ పతకం గెలుపొందారు. ఆర్చరీ 50 మీటర్ల విభాగం (మహిళా కేటగిరి)లో ఎమ్ అంజలి బంగారు పతకం సాధించారు. పురుషుల కేటగిరి ఆర్చరీ 50 మీటర్ల విభాగం కంపౌండ్ బిడబ్ల్యులో కె కిషన్ సిల్వర్, షాట్ ఔట్‌లో కాంస్య పతకాలను సాధించారు. ఈ ఏడాది మే నెలలో సౌత్ కొరియాలో జరిగే ఇంటర్నేషనల్ ఆసియా-పసిఫిక్ మాస్టర్స్ గేమ్స్‌కు వీరు ముగ్గురూ ఎంపికయ్యారు. పోటీల్లో ఉద్యోగులు పతకాలు సాధించడంపై సజ్జనర్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం కృష్ణకాంత్, స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకట నారాయణ, ఫిజియో హిమన్షు కుమార్ పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

- అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్‌ఎం డోబ్రియాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేహ దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పిసిసిఎఫ్, హెచ్ఒఎఫ్ఎఫ్) ఆర్‌ఎం డోబ్రియాల్ అన్నారు. బుధవారం హైదరాబాద్ దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో అటవీ శాఖ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు రెండు రోజుల పాటు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆర్‌ఎం డోబ్రియాల్ మాట్లాడుతూ అటవీ అధికారులు, సిబ్బంది అడవుల రక్షణలో నిత్యం విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. చార్మినార్, భద్రాద్రి, రాజన్న, యాదాద్రి, జోగులాంబ, బాసర, కాళేశ్వరం అటవీ సర్కిళ్లకు చెందిన అటవీ సిబ్బంది ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. రన్నింగ్, కబడ్డీ, లాంగ్ జంప్, వెయిట్ లిఫ్టింగ్, డిస్కస్‌త్రో, క్యారమ్స్, చెస్, రైఫిల్ షూటింగ్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు రెండు రోజుల పాటు జరిగాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిసిసిఎఫ్ (కంపా) లోకేష్ జైస్వాల్, ఫారెస్ట్ అకాడమీ ఇంచార్జి డైరెక్టర్ ఏలూసింగ్ మేరు, ఫారెస్ట్ కార్పొరేషన్ ఎండి చంద్రశేఖరరెడ్డి, ఉన్నతాధికారులు సునీత భగవత్, వినోద్ కుమార్, రామలింగం, సైదులు, అన్ని సర్కిళ్లకు చెందిన అధికారులు, జిల్లాల అటవీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జిపి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పాలడుగు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన పాదయాత్ర హైదరాబాద్ చేరకముందే ముఖ్యమంత్రి పాదయాత్ర బృందాన్ని చర్చలకు పిలవాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో టిఆర్‌ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర బుధవారం జనగామ పట్టణానికి చేరుకుంది. జనగామ కలెక్టరేట్ వద్ద పాదయాత్ర బృందానికి గ్రామపంచాయతీ కార్మికులతో పాటు ఆయా ప్రజా సంఘాల నాయకులు, వివిధ కార్మిక సంఘాల కార్మికులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక ఆర్‌టిసి చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి బృంద సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు అధ్యక్షతన జరిగిన సభలో పాలడుగు భాస్కర్ మాట్లాడారు. జనగామ జిల్లాలో నాలుగు రోజులపాటు మూడు నియోజకవర్గాల్లోని నాలుగు మండలాల్లో 26 గ్రామాల్లో పాదయాత్ర కొనసాగిందని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించే కార్మికులను 2011 జనాభా లెక్కల ప్రకారం 500 మందికి ఒకరిని నియమించారని, ఈ 12 ఏళ్లలో జనాభా పెరిగినా వారికి తగ్గట్టుగా కార్మికులను పెంచలేదని ఆరోపించారు. తెలంగాణలో మల్టీపర్పస్ విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల కారోబార్ల పరిస్థితి దీనంగా మార్చిందని విమర్శించారు. ఆయా రంగాల్లో పదోన్నతులు, గ్రేడింగ్‌లు ఉన్నట్టుగానే గ్రామపంచాయతీల్లోనూ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జిఒ 60 ప్రకారం జిపి కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు అమలుచేసి వారి పనికి భద్రత కల్పించాలన్నారు. పాదయాత్ర ముగిసేలోగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. పాదయాత్రలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు గ్యార పాండు, చాగంటి వెంకటయ్య, సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు వెంకటేష్, చంద్రశేఖర్, శ్రీకాంత్, పాలడుగు సుధాకర్, వై.సోమన్న, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మోకు కనకా రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు బొట్ల శ్రీనివాస్, ఐద్వా రాష్ట్ర నాయకులు ఇర్రి అహల్య, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పాల రైతులకు ప్రోత్సాహకాలు విడుదల చేయాలి

- తెలంగాణ రైతు సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాల రైతులకు బకాయిలతోపాటు ప్రోత్సాహకాలు విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. రైతులకు నాలుగు రూపాయల ప్రోత్సాహకాలను 2020 మార్చి నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిలిపేసిందని పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి సాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతియేటా బడ్జెట్‌లో వాటి కోసం రూ.75.50 కోట్లు కేటాయించినప్పటికి రైతులకు చెల్లించడం లేదని పేర్కొన్నారు. సహకార సంఘాల్లో పాలుపోసే రైతులకు చెల్లించాల్సిన నిధులను ఆపేసిందని తెలిపారు. రాష్ట్రంలో 26 లక్షల కుటుంబాలు పశుపోషణపై ఆధారపడి ఉన్నాయని, విజయ, ముల్కనూరు, కరీంనగర్, మదర్ సహకార పాల కేంద్రాలకు పాలుపోసే రైతులకు 3.50 లక్షల బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. పాడి ఆవులను, గేదెలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ సైతం తగ్గించిందని విమర్శించారు. పశుబీమా ప్రీమియం చెల్లింపుల కోసం ఎంతో మంది రైతులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. సహకార పాడి పరిశ్రమ ద్వారా తమకు కొంత గిట్టుబాటు ధర వస్తుందని ఆశించిన రైతులకు గత రెండేళ్లకుపైగా ప్రభుత్వ సహకారం నిలిపివేయడం సరికాదని వివరించారు. ప్రభుత్వం ప్రకటించిన పథకాలను, బీమా ప్రీమియాన్ని అమలు చేయడంతోపాటు పాల రైతులకు ప్రోత్సాహక నిధులను కేటాయించిన లీటరుకు నాలుగు రూపాయలను వెంటనే చెల్లించాలని, ఆ డబ్బులను వారి బ్యాంకు ఖాతాలో జమ చేయాలని కోరారు.

మహారాజశ్రీ కందుకూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్.నెం.387 / 2017

1. బూర్సు శ్రీనివాస రావు
2. బూర్సు హరికృష్ణ - వాదులు

వర్సెస్

బూర్సు బ్రహ్మయ్య
మరియు వగైరాలు - ప్రతివాదులు

టు,
1. బూర్సు సురేష్, (డి2), తండ్రి బ్రహ్మయ్య,
2. బూర్సు శ్రీకాంత్, (డి3), తండ్రి బ్రహ్మయ్య,
3. బూర్సు కిరణ్ కుమార్, (డి4), తండ్రి బ్రహ్మయ్య,
All are R/o. Door No.290, B.H.E.L. Old, M.I.G. Phase-I, Near Tip Top Colony, Lingalampalli, Hyderabad, Telangana State.

వాది, పై నెంబరు దావాలో మీకు కోర్టు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను నోటీసులు పంపిననూ, మీరు తీసుకోనందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా దావా నోటీసు పంపవలసినదిగా కోర్టువారు ఆర్డరు చేస్తూ పై దావాను **తేదీ: 28-02-2023** న వాయిదా వేసినారు. ఆ తేదిన మీరు **ఉదయం గం|| 10.30 ని||లకు** పై కోర్టులో స్వయంగా గానీ, మీ ప్లీడరు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమునందు తీర్మానించబడునని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

" కోర్టు వారి ఉత్తర్వులతో "
సన్నెబోయిన శ్రీనివాసులు
షేక్. షంషుద్దీన్
న్యాయవాదులు, కందుకూరు.

'ఎమ్మెల్సీ' ఫైట్

- హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక
- ఉద్యమ నాయకుడు మాణిక్‌రెడ్డిని గెలిపించండి టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మరో ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే ఓటర్ లిస్టును తయారు చేసి ఎన్నికల నియమావళిని ప్రకటించగా.. గురువారం ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎన్నికల్లో 29,591 ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. విద్యారంగాన్ని కాపాడుకోవాలన్న లక్ష్యంతో టిఎస్ యుటిఎఫ్ నుంచి మాణిక్‌రెడ్డి పోటీలో ఉండగా.. పిఆర్‌టియు, మరికొన్ని ఇతర ఉపాధ్యాయ సంఘాలు సైతం ఎన్నికల బరిలో నిలుస్తున్నాయి. ప్రజాసంస్థలను కాపాడుకోవాలని ఉద్యమాలు చేసే సంఘం యుటిఎఫ్ సంఘమని నాయకులు తెలిపారు.

హైదరాబాద్- రంగారెడ్డి - మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికకు సంబంధించి గురువారం నోటిఫికేషన్ రానుండటంతో ప్రచారం తారాస్థాయికి చేరుకుంది. ఉమ్మడి మూడు జిల్లాల పరిధిలో 29,501 ఓటర్లు ఉన్నారు. ప్రతి మండలానికీ ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. మార్చి 13న నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ప్రధాన ఉపాధ్యాయ సంఘాల నాయకులు చాలా రోజుల నుంచి ప్రచారాన్ని చేస్తున్నారు. టిఎస్‌యుటిఎఫ్ నుంచి మాణిక్‌రెడ్డి, పిఆర్‌టియు నుంచి చెన్నకేశవరెడ్డి ప్రచారంలో ఉన్నారు. ఎస్‌టియు నుంచి భుజంగరావు, తాజాగా కొనసాగుతున్న కాటేపల్లి జనార్దన్ రెడ్డి సైతం తలపడనున్నారు. ఇంకా హర్షవర్ధన్‌రెడ్డి.. మరికొంత మంది పోటీ చేయడానికి సద్ధమవుతున్నారు. ఎంతమంది పోటీ చేసినా టిఎస్ యుటిఎఫ్, పిఆర్‌టియు మధ్యనే ప్రధాన పోటీ ఉండే అవకాశాలు

స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిచిన నాయకులు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, విద్యారంగం బలోపేతం కోసం కృషి చేయనున్నారు. ఇప్పటికే యుటిఎఫ్ నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉన్న నర్సిరెడ్డి విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారు. ఆయనకు తోడుగా మాణిక్‌రెడ్డిని శాసన మండలికి పంపిస్తే.. విద్యారంగానికి విశేష సేవలు అందించే అవకాశాలుంటాయని ఉపాధ్యాయ నాయకులు తెలిపారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని మాణిక్‌రెడ్డి కోరారు.

విద్యారంగ పరిరక్షణకు కృషి

- టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య

ఉపాధ్యాయ ఓట్లతో గెలిచిన ఎమ్మెల్సీలు విద్యారంగ పరిరక్షణ కోసం కృషి చేయాలి. ముఖ్యంగా బడ్జెట్లో అధిక నిధులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. విద్యారంగానికి కేరళ తరహాలో బడ్జెట్లో నిధులు అధికంగా కేటాయించాల్సి ఉంది. ముఖ్యంగా కార్పొరేట్ శక్తుల కబంధహస్తాల్లో విద్యార్థిలోకం విలవిల్లాడుతోంది. లక్షల్లో ఫీజులు చెల్లించలేని దుస్థితిలో విద్యార్థులు ఉన్నారు. ఎమ్మెల్సీగా గెలిచిన నాయకులు కౌన్సిల్ సమావేశంలో విద్యారంగానికి అధిక నిధులు వచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. మార్చిలో నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమ నేపథ్యం కలిగిన మాణిక్‌రెడ్డిని అత్యధిక ఓట్లతో గెలిపించి విద్యారంగ పరిరక్షణకు సహకరించాలని పలువురు మేధావులు, ఉపాధ్యాయులు కోరారు.

ఇటుక బట్టీల్లో దారుణం

- బాలికలపై లైంగిక వేధింపులు
- జీతాలివ్వకుండా ఇబ్బందులు
- 72 మంది ఒడిశా లేబర్‌తో వెట్టిచాకిరీ
- ఒడిశా సిఎంఒకు ఫిర్యాదు చేసిన కార్మికులు
- సంగారెడ్డి కలెక్టర్‌కు ఇ-మెయిల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇటుకబట్టీల్లో దారుణం జరిగింది. సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండలం దర్గాతండాలో ఇటుకబట్టీ నిర్వహించే యజమాని దాష్టీకానికి ఒడిశా కార్మికులు బలిపశువులయ్యారు. కార్మికులతో వెట్టి చేయిస్తూ ఇబ్బందులకు గురి చేయడమే కాకుండా బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. చైల్డ్ ప్రొటక్షన్, కార్మిక శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. దర్గాతండాకు చెందిన సర్పంచ్ ఎస్ఆర్‌కె బ్రిక్స్ పేరిట నిర్వహించే ఇటిక బట్టీల్లో పనిచేసేందుకు ఒడిశాకు చెందిన 72 మంది కార్మికులను తీసుకొచ్చారు. ఏడు నెలలుగా బట్టీల్లో పనిచేయిస్తున్నారు. నాలుగు నెలలుగా కార్మికులకు జీతాల్వికుండా యజమాని ఇబ్బందులకు గురి చేశారు. ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికుల కుటుంబాల్లో మైనర్‌లు కూడా ఉన్నారు. వేతనాలివ్వకపోవడమే కాకుండా మైనర్లు అయిన ఆడపిల్లలపై లైంగింకగా వేధింపులకు పాల్పడటంతో విసుగు చెందిన కార్మికులు ఒడిశా సిఎంఒకు పిర్యాదు చేశారు. కార్మికుల ఫిర్యాదుకు స్పందించిన ఒడిశా అధికారులు.. తెలంగాణ రాష్ట్ర సిఎస్, కార్మిక శాఖ అధికారులకు మెయిల్ రూపంలో ఫిర్యాదు చేశారు. దీంతో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఎ.శరత్‌కు రాష్ట్ర అధికారుల నుంచి మెయిల్ వచ్చింది. వెంటనే స్పందించిన కలెక్టర్ జిల్లా లేబర్ అధికారులు, స్త్రీ సంక్షేమ, చైల్డ్ ప్రొటక్షన్ అధికారులు యాదయ్య, రత్నం, నవనీతతో పాటు నారాయణఖేడ్ పోలీసులు బుధవారం ఇటుకబట్టీ వద్ద విచారించారు. ఒడిశా కార్మికులను కలిసి యజమాని పెట్టిన ఇబ్బందుల గురించి ఆరా తీశారు. జీతాలివ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం, బెదిరించడమే కాకుండా ఏడుగురు బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు కార్మికులు వివరించారు. విచారణకు వచ్చిన అధికారుల ముందు బాధిత కార్మికులు గోడు వెళ్లబోసుకున్నారు. కార్మికులు చెప్పిన వివరాలను పరిశీలించిన అధికారులు ఎస్ఆర్‌కె బ్రిక్స్ ఇటుకబట్టిని సీజ్ చేశారు. జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి నవనీత ఫిర్యాదు మేరకు ఇటుకబట్టి యజమానితో పాటు మరో ముగ్గురిపై బాల కార్మిక చట్టాల ఉల్లంఘనతో పాటు లైంగిక వేధింపులకు సంబంధించిన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇటుకబట్టిలో పనిచేస్తున్న 72 మంది కార్మికుల్ని అధికారులు ఒడిషాకు పంపారు.

TMT (INDIA) LIMITED
(CIN: L99999TG1976PLC002002)
Registered Office: A-28, 2nd floor, Journalist Colony, Road No.70, Jubilee Hills, Hyderabad 500033 Website:www.tmtindia.in, Email:cstmtindia@gmail.com
Telephone: 040-23204088, 23556089

నోటీసు

టిఎంటి (ఇండియా) లిమిటెడ్ కంపెనీ వ్యాపార కార్యకలాపాలను సమీక్షించి నిర్దేశించుటకు కంపెనీ సభ్యుల సర్వసభ్య సమావేశం (ఎజిఎం) మార్చి 10, 2023 శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎ-28, 2వ ఫ్లోర్, జర్నలిస్టు కాలనీ, రోడ్ నెం.70, జూబ్లీ హిల్స్, హైదరాబాద్ 500033 నందు నిర్వహించబడునని ఈ నోటీసు ద్వారా తెలియచేయటమైనది. కంపెనీలో నమోదు చేయబడిన చిరునామాలో ఆ సభ్యులకు నోటీసు పోస్ట్ చేయబడింది.

ఇజిఎమ్ ప్రయోజనం కొరకు కంపెనీ సభ్యుల తదుపరి రిజిస్టర్ మరియు షేర్ బదిలీ పుస్తకాలు 4 మార్చి 2023 నుండి 10 మార్చి 2023 వరకు (రెండు రోజులు కలుపుకొని) మూసివేయబడి ఉంటాయి.

ఇజిఎమ్ నోటీసు కంపెనీ వెబ్‌సైట్ www.tmtindia.in లో కూడా అందుబాటులో ఉంటుందని మరియు నోటీసులో ప్రస్తావించిన వివరణాత్మక ప్రకటన, ఇతర పత్రాలతో పాటు తనిఖీ కూడా ఉంటుందని దయచేసి గమనించగలరు. జరిగే తేదీ వరకూ కంపెనీ రిజిస్టర్డ్ ఆఫీస్‌లో అన్ని పనిదినాలలో ఉదయం 10:30 గం. నుండి 12:30 గం. వరకూ అందుబాటులో ఉంటుంది.

ఇ-ఓటింగ్:

కంపెనీల చట్టం 2013 సెక్షన్ 108, మరియు ఇతర వర్తించే నిబంధనల ప్రకారం ఇజిఎం నోటీసులో ప్రస్తావించిన అన్ని అంశాలపై ఇజిఎంలో కార్యకలాపాలు నిర్వహించేందుకు సభ్యులకు ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఓటు వేసేందుకు (రిమోట్ ఇ-ఓటింగ్) సౌకర్యాన్ని కంపెనీ కల్పిస్తోంది. చట్ట నిబంధనల ప్రకారం ఇ-ఓటింగ్ ప్రక్రియను సరైన, పారదర్శక పద్ధతిలో నిర్వహించేందుకు ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రెటరీ మోహిత్ గుర్జర్‌ను బోర్డు నియమించింది. కంపెనీల చట్టం 2013లోని సంబంధిత నియమ నిబంధనలు:

1. కంపెనీ ఇజిఎంకు సంబంధించిన నోటీసును కంపెనీ షేర్లు కలిగి వున్న సభ్యులందరికీ 14 ఫిబ్రవరి, 2023న పంపడమైనది.
2. రిమోట్ ఇ-ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యే తేదీ, సమయం: 7 మార్చి, 2023 ఉదయం. 9 గంటలు (ఐఎస్‌టి)
3. రిమోట్ ఇ-ఓటింగ్ ప్రక్రియ ముగిసే తేదీ, సమయం: 9 మార్చి, 2023 సాయంత్రం 5 గంటలు. (ఐఎస్‌టి)
4. రిమోట్ ఇ-ఓటింగ్‌కు కటాఫ్ తేదీ: 3 మార్చి, 2023
5. ఇజిఎం నోటీసు జారీ అయిన తరువాత కటాఫ్ తేదీ నాటికి కంపెనీ షేర్లు కొనుగోలు చేసి కంపెనీ సభ్యుడిగా మారిన వ్యక్తి వార్షిక నివేదికలో పొందుపర్చిన ఇ-ఓటింగ్ సూచనలను పరిశీలించవచ్చు. ఇది కంపెనీ వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో వుంటుంది. ఎవరైనా సభ్యుడు ఇ-ఓటింగ్ కోసం సిడిఎస్ఎల్ వద్ద ఇప్పటికే రిజిస్టర్ చేసుకుని వుంటే వారు తమ వద్ద ప్రస్తుతం వున్న యూజర్ ఐడి, పాస్‌వర్డ్‌లను ఉపయోగించి ఓటు వేయవచ్చు.
6. **సభ్యులు గమనించాల్సిన అంశాలు**

1. ఎలక్ట్రానిక్ పద్ధతిలో సిడిఎస్ఎల్ నిర్వహించే రిమోట్ ఇ-ఓటింగ్ 29 సెప్టెంబర్ 2022 సాయంత్రం 5 గంటల తరువాత అనుమతించబడదు.
2. సభ్యులు ఒకసారి ఒక తీర్మానంపై ఓటు వేసిన తరువాత దానిని మార్చుకొనుటకు అనుమతించబడరు.
3. రిమోట్ ఇ-ఓటింగ్ సౌకర్యాన్ని ఉపయోగించుకోని సభ్యులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పింబడుతుంది.
4. ఇజిఎంకు ముందు రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా ఓటు వేసిన సభ్యులు ఇజిఎంకు హాజరు కావచ్చు. అయితే వారికి మరోమారు ఓటు వేసే అవకాశం వుండదు.
7. ఎజిఎం నోటీసు, రిమోట్ ఇ-ఓటింగ్‌కు సంబంధించిన విధివిధానాలను నిర్ణీత విధానంలో సభ్యులందరికీ పంపటంతో పాటు కంపెనీ వెబ్‌సైట్ www.tmtindia.inలో కూడా అందుబాటులో ఉంచటం జరిగింది.
8. రిమోట్ ఇ-ఓటింగ్‌కు సంబంధించి ఎవరికైనా సందేహాలు/సమస్యలు వుంటే సభ్యులు కంపెనీ సిఎఫ్ఓ ఎవి రమణమూర్తిని కంపెనీ రిజిస్టర్డ్ కార్యాలయం పా28, 2వ ఫ్లోర్, జర్నలిస్టు కాలనీ, రోడ్ నెం.70, జూబ్లీ హిల్స్, హైదరాబాద్ 500033లో సంప్రదించవచ్చు. మొబైల్ నెం. 9032743926, ఇ-మెయిల్ cstmtindia@gmail.com దీనితో పాటు సభ్యులు ఇ-ఓటింగ్‌కు సంబంధించి తమ సందేహాలు సమస్యలను helpdesk.evoting@cdslindia.com కు ఇమెయిల్ ద్వారా తెలియచేయవచ్చు.

For TMT(INDIA) LIMITED
Sd/-
VENU KRISHNA KISHORE BABU PASAM
Whole-time Director
(DIN:06734586)

Place: HYDERABAD
Date : 14-02-2023

త్రిపురలో స్వేచ్ఛయుతంగా ఎన్నికలు జరపాలి

- వామపక్షాలపై బిజెపి హింసాదాడులను అరికట్టాలి
- ఆస్తులు కోల్పోయినా, హత్యలకు గురైనా కార్యకర్తలు, ప్రజలు ఎర్రజెండాను వదల్లేదు
- వారి నుంచి మనమంతా స్ఫూర్తి పొందాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

త్రిపురలో జరిగే ఎన్నికలను స్వేచ్ఛయుతంగా, నిష్పక్షపాతంగా జరపాలని కేంద్ర ఎన్నికల కమిషనర్‌ను సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. వామపక్షాలపై బిజెపి హింసాదాడులను అరికట్టాలన్నారు. సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం బాగ్‌లింగంపల్లి ఎస్‌వికెలోని దొడ్డి కొమరయ్య హాల్‌లో సభ జరిగింది. నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో తమ్మినేని మాట్లాడారు. అధికారంలో ఉన్నామనే అహంకారంతో బిజెపి ప్రభుత్వం త్రిపురలో అప్రజాస్వామిక పద్ధతులు అనుసరిస్తోందని, ఆ పార్టీ దమనకాండను అరికట్టాలన్నారు. త్రిపురలో ప్రతిపక్షాలను లేకుండా చేయడంతోపాటు వారిని అడ్డుకునే శక్తులను లేకుండా చేయాలని బిజెపి దుర్మార్గపు ఆలోచన చేస్తోందన్నారు. ఎమర్జెన్సీ విధించిన ఇందిరాగాంధీకి పట్టిన గతే బిజెపి చీకటి పరిపాలనకు పడుతుందని హెచ్చరించారు. అదానీ ఆర్థిక అవకతవకలపై హిండెన్ బర్గ్ వెల్లడించినా.. బిజెపి ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం అదానీ-మోడీల బంధాన్ని బహిర్గతం చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసి, ఎస్‌బిఐ నుంచి అదానీ సంస్థలు వేలకోట్ల రూపాయల రుణాలు తీసుకుని.. కృత్రిమ లాభాలు చూపించే ప్రయత్నం చేశాయని, దేశ సంపదను దోపిడీ చేయడమూ దేశం కోసమేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడానికి ప్రయత్నించిన ఎవరైనా చరిత్ర గర్భంలో కలిసి పోవాల్సిందేనని.. ఇదే గతి మోడీ, కాషాయ కూటమికీ పడుతుందని హెచ్చరించారు. త్రిపురలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తీవ్రమైన హింసాకాండ కొనసాగుతున్నదని, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలపై, ప్రజలపై దాడులు చేస్తూ ప్రజలందరినీ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల అండదండలతో బిజెపి దౌర్జన్యాలకు పాల్పడుతున్నదని విమర్శించారు. ఒకపక్క మోడీ ప్రతిష్ట రోజు రోజుకీ దిగజారుతుండగా త్రిపురలో ఏదో రకంగా ఎన్నికల్లో గెలిచి ప్రజల దృష్టి మరలించేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఇన్ని దౌర్జన్యాలు, ఆస్తులు ధ్వంసం చేసినా, హత్యలు, లైంగికదాడులు చేసినా అక్కడి ప్రజలు, కార్యకర్తలు ఎర్రజెండాను వదలలేదన్నారు. వారి నుంచి ఆ స్ఫూర్తిని మనము పొందాలన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి.నర్సింహారావు మాట్లాడుతూ.. త్రిపురలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 2 వేల సిపిఎం ఆఫీసులను ధ్వంసం చేసిందన్నారు. 600 మంది కార్యకర్తలను హత్య చేయించిందన్నారు. అంతేకాకుండా ఆ రాష్ట్ర మాజీ సిఎం, సిపిఎం నేత మాణిక్ సర్కారుపై దాడులకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పారు. మహిళలపైనా ఎన్నడూ లేని విధంగా హత్యలు, లైంగికదాడులకు పాల్పడుతున్నారన్నారు. ఇంత నిర్బంధంలోనూ అక్కడి ప్రజలు, పార్టీ నాయకత్వం, కార్యకర్తలు ప్రజాసమస్యలపై పనిచేస్తున్నారన్నారు. నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. బిజెపి, మోడీ దౌర్జన్యాలు, అరాచకాలను అడ్డుకోవాలన్నారు. బిజెపి ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి కెసిఆర్ మాట్లాడుతున్నారని, ఇది మంచి పరిణామమేనని చెప్పారు. అదే సమయంలో రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలపైనా తాము పోరాడుతున్నామని చెప్పారు. నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.నాగలక్ష్మి మాట్లాడుతూ హిండెన్ బర్గ్ నివేదిక, అదానీ అక్రమాలతో అబాసుపాలవుతున్న తరుణంలో త్రిపురలో ఎలాగైనా గెలవాలని బిజెపి, మోడీ ప్రభుత్వం దాడులు అరాచకాలు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.దశరథ్, ఎం.శ్రీనివాస్‌రావు, ఎం.మహేందర్, ఎం.వెంకటేష్, కె.ఎన్.రాజన్న, మాజీ నగర కార్యదర్శి పీఎస్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జిపి పాదయాత్రకు వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డ్ యూనియన్ సంఘీభావం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయితీ సిబ్బంది కనీస వేతనం రూ.26,000లు ఇవ్వాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని తదితర డిమాండ్లపై చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుల పాదయాత్రకు వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డ్ యూనియన్ సంఘీభావం తెలిపింది. బుధవారం జనగామలో పాదయాత్ర బృందానికి స్వాగతం పలికి పూలమాలతో సత్కరించి యాత్రకు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. సెక్యూరిటీ గార్డ్స్ ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని పాలడుగు భాస్కర్‌కు వినతిపత్రం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్లలో పనిచేస్తున్న 1,200 మంది సెక్యూరిటీ గార్డులకు థర్డ్ పార్టీ ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా వ్యవసాయ మార్కెట్ కమిటీల నుండి వేతనాలు చెల్లించాలని, కార్మికశాఖ విడుదల చేసిన జిఒ నెం. 21ని గెజిట్ చేసి సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనాలు అమలు చేసే విధంగా కృషి చేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న, జిల్లా అధ్యక్షులు వెంకటేష్, జిల్లా కార్యదర్శి బత్తిన వేణు, ఉపాధ్యక్షులు కుమారస్వామి, కార్యవర్గ సభ్యులు ప్రవీణ్, లక్ష్మయ్య ఉన్నారు.

రాయలోక్ 142వ ఫర్నీచర్ స్టోర్ ఏర్పాటు

హైదరాబాద్ : రాయలోక్ ఫర్నీచర్ తన 142వ స్టోర్‌ను హైదరాబాద్‌లోని కొంపల్లిలో ఏర్పాటు చేసింది. బుధవారం దీన్ని నటీ శ్రీలీలా, రాయలోక్ ఫర్నీచర్ ఛైర్మన్ విజయ్ సుబ్రమణ్యం లాంచనంగా ప్రారంభించారు. విస్తరణ ప్రణాళికల్లో భాగంగా కొత్త స్టోర్‌ను ఇక్కడ ఏర్పాటు చేశామని విజయ్ పేర్కొన్నారు. తమ సంస్థ అమెరికా, ఇటలీ, వియత్నాం, టర్కీ, జర్మనీ, మలేషియా లాంటి దేశాల్లోనూ కార్యకలాపాలు కలిగి ఉందన్నారు.

దక్షిణాఫ్రికా టూరిజంలో హైదరాబాద్ కీలకం

హైదరాబాద్ : దక్షిణాఫ్రికా పర్యాటకాభివృద్ధిలో హైదరాబాద్ కీలకంగా ఉందని దక్షిణాఫ్రికా టూరిజం ఎంఇఐఎస్ఇఎ హబ్ హెడ్ నీలిస్వా ఎన్కాని పేర్కొన్నారు. భారత దేశ మార్కెట్‌లో తమకు హైదరాబాద్ మూడో అతిపెద్ద ఆధారంగా ఉందని పేర్కొన్నారు. బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. దక్షిణాఫ్రికా 2022లో భారతీయులకు ప్రముఖ ప్రయాణ గమ్యస్థానాలలో ఒకటిగా అవతరించిందన్నారు. తమ దేశాన్ని తదుపరి సాహస గమ్యస్థానంగా ఎంచుకుంటున్నారన్నారు. గతేడాదితో పోలిస్తే భారత్ నుంచి ప్రయాణికులు 200 శాతానికి పైగా పెరిగారన్నారు. గతేడాది నవంబర్ వరకు దాదాపు 50,000 మంది భారతీయులకు స్వాగతం పలికామన్నారు. ఈ వృద్ధిని మరింత పెంచడానికి, దక్షిణాఫ్రికా టూరిజం ఫిబ్రవరి 13 నుంచి 16 మధ్య ప్రధాన నగరాలైన కోల్‌కతా, చెన్నయ్, హైదరాబాద్, ముంబయిలలో రోడ్ షోలను నిర్వహిస్తుందన్నారు.

కొండగట్టులో రోడ్డు ప్రమాదం

- ఆర్‌టిసి బస్సు.. లారీ ఢీ
- బస్ కండక్టర్ మృతి..
- ఎనిమిది మందికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొండగట్టు సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. బుధవారం తెల్లవారుజామున జగిత్యాల జిల్లా మల్యాల మండలం బస్వంతాపూర్ క్రాస్ రోడ్డుపై ఆర్‌టిసి బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్ కండక్టర్ అక్కడికక్కడే ప్రాణం కోల్పోయారు. ఎనిమిది మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం..

తెల్లవారు జామున జగిత్యాల డిపో ఆర్‌టిసి బస్సు వరంగల్‌కు బయలుదేరింది. కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు కలప లోడ్‌తో వెళ్తున్న లారీ మల్యాల మండలంలోని బస్వంతాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఆర్‌టిసి బస్సును ఢీకొని బోల్తాపడింది. ఈ ఘటనలో కొడిమ్యాల మండలం శ్రీరాములపల్లికి చెందిన బస్ కండక్టర్ బొల్లం సత్తయ్య(55) అక్కడికక్కడే మృతిచెందారు. బస్సులో ఉన్న ఎనిమిది మందికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108లో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండగా.. కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సీఐ రమణమూర్తి ఘటనా స్థలంలో పరిశీలించారు. రోడ్డుకు అడ్డుగా పడిన వాహనాలను జెసిబి సహాయంతో తొలగించారు. మృతుని కొడుకు బొల్లం ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రమాద బాధితులను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం కండక్టర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బిబిసిపై కక్షసాధింపు

- ఐటి దాడులకు జర్నలిస్టు సంఘాల ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుజరాత్‌లోని గోధ్రా అల్లర్లపై బిబిసి ప్రసారం చేసిన సంచలనాత్మక డాక్యుమెంటరీ విషయంలో కేంద్ర ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడటాన్ని పలు జర్నలిస్టు సంఘాలు ఖండించాయి. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య , ఐఎఫ్‌డబ్ల్యుజె జాతీయ కార్యదర్శి పి ఆనందం, ఎన్ఎజె నేషనల్ సెక్రెటరీ జనరల్ ఎన్ కొండయ్య, టిబిజిఎ రాష్ట్ర అధ్యక్షులు పి రాధిక, ప్రధానకార్యదర్శి వి జ్యోతిబసు, హెచ్‌యుజె అధ్యక్ష, కార్యదర్శులు బి అరుణ్‌కుమార్, బి జగదీశ్ బుధవారం సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో మీడియా స్వేచ్ఛను కేంద్ర ప్రభుత్వం ప్రశ్నార్థకం చేస్తోందన్నారు. ఐటీ దాడుల పేరుతో ప్రతికార దాడులు చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. గత మూడు రోజుల్లో న్యూఢిల్లీ, ముంబయి బిబిసి కార్యాలయాల్లో నిరంతరాయంగా ఐటీ దాడులు చేయడం ఎంతమాత్రం సమంజసం కాదని అన్నారు. ప్రజల తరపున మీడియా పనిచేయకూడదా ? అని ప్రశ్నించారు. మీడియా అంటేనే ప్రజలు, ప్రభుత్వాల మధ్య వారధిగా ఉండేదని గుర్తు చేశారు. పాత్రికేయుల ఫోన్లను ట్యాప్‌చేయడం, ల్యాప్‌ట్యాప్‌లను బలవంతంగా ఐటీ అధికారులు స్వాధీనం చేసుకోవడం సరికాదని వ్యాఖ్యానించారు. ఐటీ దాడులు చేస్తూ, సర్వే అని బుకాయించడాన్ని ఖండించారు. ప్రధాని మోడీ గుజరాత్ అల్లర్లపై తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని కోరారు. దాడుల ద్వారా మీడియా సంస్థలను భయపెట్టాలని చూడటం, స్వేచ్ఛకు సంకెళ్లు వేసే ప్రయత్నం చేయడం చెల్లదని చెప్పారు.

ప్రభుత్వ బడుల్లో పెరిగిన విద్యార్థులు

- మన ఊరు మనబడితో మరింత మంది చేరే అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగింది. ఇటీవల ప్రకటించిన సామాజిక, ఆర్థిక సర్వే-2023 గణాంకాల ప్రకారం ఏడాది కాలంలో దాదాపు రెండు లక్షల మంది విద్యార్థులు సర్కారు బడుల్లో అదనంగా నమోదయ్యారు. ఈ మేరకు సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ అర్వింద్ కుమార్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2020-21లో ఉన్న 41,220 నుంచి 2021-22లో 41,369కు పెరిగాయి. 2020-21లో 60.40 లక్షల మంది విద్యార్థులుంటే, 2021-22లో 62.30 లక్షలకు పెరిగారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఇంగ్లీష్ మీడియంలో బోధన, సాఫ్ట్‌స్కిల్స్ ప్రవేశపెట్టడం వల్ల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు మొగ్గు చూపుతున్నారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నమోదవుతున్న విద్యార్థుల శాతం 2019-20లో 42.91 శాతం, 2020-21లో 43.47 శాతం, 2021-22లో 49.77 శాతంగా ఉందని పేర్కొన్నారు. అంటే నమోదు శాతం ఏటా పెరుగుతోందని తెలిపారు. ఇదే కాలంలో ప్రయివేటు పాఠశాలల్లో 2019-20లో 57.09 శాతం, 2020-21లో 56.53 శాతం, 2021-22లో 50.23 శాతానికి పడిపోయిందని పేర్కొన్నారు. అంటే ప్రయివేటు పాఠశాలల్లో నమోదు శాతం గణనీయంగా తగ్గిందని వివరించారు. ప్రాథమిక స్థాయి నుంచి ప్రాథమికోన్నత స్థాయికి వెళ్తున్న విద్యార్థుల శాతం దేశవ్యాప్తంగా సగటున 3.83 శాతం ఉంటే, రాష్ట్రంలో 7.48 శాతం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, మన ఊరు-మనబడి కార్యక్రమం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు మరింత పెరగనుందని పేర్కొన్నారు. మూడేండ్ల వ్యవధిలో రూ.7,289.54 కోట్లతో మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని వివరించారు. రాష్ట్రంలోని 26,065 పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. మొదటి దశలో రూ.3,497.62 కోట్లతో 14,71,684 మంది విద్యార్థులు చదువుతున్న 9,123 పాఠశాలలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఏ విషయంలోనూ వెనుకబడి ఉండొద్దనే సిఎం కెసిఆర్ భావించి ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. ఇది విజయవంతమైతే ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయనడంలో అతిశయోక్తి లేదని పేర్కొన్నారు.

ఐసిడిఎస్‌ను అభివృద్ధి పర్చాలి

- అంగన్‌వాడీ ఉద్యోగులకిచ్చిన హామీలను నెరవేర్చాలి
- సిఎం కెసిఆర్‌కు జూలకంటి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐసిడిఎస్‌ను అభివృద్ధిపర్చాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. వారికి కనీస వేతనం, పెన్షన్, ఇఎస్ఐ, ఉద్యోగ భద్రత వంటి చట్టబద్ధమైన సౌకర్యాలను కల్పించాలని సూచించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు ఆయన బుధవారం లేఖ రాశారు. రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు 40 ఏండ్లకుపైగా ఐసిడిఎస్‌లో పనిచేస్తున్నారని తెలిపారు. తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని గుర్తు చేశారు. కర్నాటకలో హెల్త్ కార్డులిచ్చారని పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్, కేరళలో కనీస వేతనాలు, ఉద్యోగ విరమణ సౌకర్యాలు, పెన్షన్, పండుగ బోనస్ సౌకర్యాలు కల్పిస్తున్నారని వివరించారు. సిఎం కెసిఆర్ ప్రగతి భవన్‌కు పిలిపించుకుని ఇచ్చిన హామీలైనా అమలు చేయకపోవడంతో వారు ఆందోళనలో ఉన్నారని తెలిపారు.

వారు ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద కుటుంబాలకు చెందినవారేనని పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా వేతనాలు పెరగకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టీచర్లతో సమానంగా అంగన్‌వాడీ ఉద్యోగులకు వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 2018 అక్టోబర్‌లో కేంద్రం పెంచిన వేతనం అంగన్‌వాడీ టీచర్లకు రూ.1,500, హెల్పర్లకు రూ.750, మినీ వర్కర్లకు రూ.1,250 రాష్ట్ర ప్రభుత్వం బకాయిలతో సహా చెల్లించాలని కోరారు. 2017 నుంచి టిఎ, డిఎ, ఇంక్రిమెంట్, ఇన్‌ఛార్జ్ అలవెన్సు బకాయిలు, పిఆర్‌సి బకాయిలను చెల్లించాలని తెలిపారు. మూడేళ్ల రేషన్‌షాపు రవాణా ఛార్జీలను ఇవ్వాలని పేర్కొన్నారు. ఆరోగ్య లక్ష్మి మెనూ ఛార్జీలు పిల్లలకు రూ.1.15 పైసల నుంచి రూ.ఐదుకు, గర్భిణీ/బాలింతలకు రూ.2.40 పైసల నుంచి రూ.పదికి పెంచాలని, డబుల్ సిలిండర్లు ఇవ్వాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని తెలిపారు. వేతనంలో సగం పెన్షన్ నిర్ణయించాలని కోరారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని తెలిపారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా గుర్తించాలని పేర్కొన్నారు. మదర్స్ కమిటీ ఛైర్మెన్‌గా సర్పంచులకు బదులుగా తల్లులను నియమించాలని తెలిపారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

తొమ్మిదవ రోజునకు హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేపట్టిన హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా తొమ్మిదవ రోజు మండల కేంద్రం నుండి ధర్మపురం మీదుగా పాలకుర్తి కొనసాగింది. జనగామ జిల్లా అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి అధ్యక్షతన పాదయాత్ర మండల కేంద్రం నుండి ధర్మపురం మీదుగా సాగింది.ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రైతుతో రాష్ట్ర పాలన ఏ విధంగా ఉందని చర్చించారు. అనంతరం గంగాదేవి అమ్మ గుడి వద్ద గొల్ల కురుమలు అందజేసిన గొర్రె పిల్లను తీసుకున్నారు. అనంతరం పత్తి రైతులతో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నాడు. ధర్మపురం గ్రామంలో డబుల్ బెడ్ రూమ్‌లలో ఖాళీ మద్యం బాటిల్‌ను చూసి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సిరిసిల్ల రాజయ్య,కొమ్మూరి ప్రతాపరెడ్డి, ధన్వంతి,ఇందిర, లక్ష్మీనారాయణ నాయక్,జిల్లా నాయకులు నల్ల శ్రీరాములు,ప్రదీప్ రెడ్డి,మండల నాయకులు పెద్దికష్ణమూర్తి, ధర్మారెడ్డి,ఎర్రయ్య,మహ్మద్ జాకీర్, పులిపంపుల భాస్కర్ పెద్ద ఎత్తున ఎన్ఎస్‌యు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చేనేత స్కాంపై ఇడికి దాసు సురేష్ ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేనేత కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)కి బిసి రాజ్యాధికార సమితి నేత దాసు సురేష్ ఫిర్యాదు చేశారు. దాన్ని ఇడి స్వీకరించింది. విచారణను వేగవంతం చేసి నిందితులను చట్టబద్ధంగా శిక్షించాలని ఆయన బుధవారం ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రమణాచారిని సత్కరిస్తున్న శ్రీనివాస్ గుప్తా తదితరులు

ఉన్నత స్థానంలో సమాజానికి సేవ చేసే వారుండాలి

- పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ శ్రీనివాస్ గుప్తా

ప్రజాశక్తి - కల్చరల్

సామాజానికి సేవ చేసేవారు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే వారు ఉన్నత స్థానంలో ఉండాలని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ శ్రీనివాస్ గుప్తా అన్నారు. రమణాచారి ఇఎఎస్ అధికారిగా అనంతరం ప్రభుత్వ సలహాదారుగా ఆయన చేస్తున్న సాంస్కృతిక సామాజిక సేవ ఉన్నత అధికారులకు మార్గదర్శనం కావాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గానసభ నిర్వహణలో జరుగుతున్న ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణాచారి జన్మదిన సప్తాహంలో భాగంగా శ్రీత్యాగరాయ గాన సభకు చెందిన సంగీత గురువు ఉదయ్ కుమార్ శిష్య బృందం త్యాగరాజస్వామి కీర్తనలను మధురంగా గానం చేయగా నాట్య గురువు రేణుక శిష్య బృందం కూచిపూడి నర్తనం ఆకట్టుకుంది. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో అతిథిగా శ్రీనివాస్ గుప్తా పాల్గొని రమణాచారిని సత్కరించి మాట్లాడారు. తెలంగాణ గడ్డపై పుట్టిన రమణాచారి తెలుగువారందరికీ ఆత్మ బంధువు అని కొనియాడారు. అధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ అధికార పదవిలో వున్న సమయంలో ఏ శాఖలో ఉన్న సమర్థవంతంగా పని చేసిన పాలనా దక్షుడు రమణాచారి అన్నారు. ఆయనకు పద్మ పురస్కరం రావాలని ఆకాంక్షించారు. డాక్టర్ రమణాచారి స్పందన తెలుపుతూ జీతం, హోదాల కోసం కాక సివిల్ సర్వీస్‌కు పోటీ పడే వారు సామాజిక సేవ కొసం రావాలని అన్నారు. జీవించినంత కాలంలో ఎంత మన వల్ల ఇతరులకు మేలు కలిగింది అని ప్రశ్నించు కుంటే ఆ జీవితం సార్ధకమన్నారు.

ఇంటింటికీ 'తెలుగుదేశం'

- సర్వం సన్నద్ధంకండి
- రాష్ట్ర అధ్యక్షుడు కాసాని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

త్వరలో ప్రారంభమయ్యే ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలని పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి నాయకులను తెలంగాణ తెలుగుదేశం శాఖ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన మెటీరియల్ కిట్లను టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పార్టీ శ్రేణులకు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. బుధవారం ఎన్‌టిఆర్ భవన్లో పార్లమెంట్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులతో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వాహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత పేద ప్రజానీకానికి తెలుగుదేశం ఆవిర్భావంతోనే నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. బిసి, ఎస్‌సి, ఎసిటిలకు రాజకీయ, సామాజిక న్యాయంతో పాటు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించి రాజ్యాధికారంలో టిడిపి భాగస్వామ్యం కల్పించిందన్నారు. దేశంలోనే తొలిసారి వినూత్న పథకాలతో పేద, బడుగు వర్గాల సంక్షేమం కోసం ఎన్‌టిఆర్ కృషి చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివద్ధి చేసి ఐటీ రంగంలో హైదరాబాద్‌ను అగ్రగామిగా నిలిపిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. సంక్షేమ, అభివృద్ధి, సామరస్య పాలన కోసం తెలంగాణలో మరలా టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని జ్ఞానేశ్వర్ చెప్పారు. గతంలో ఎన్‌టిఆర్, చంద్రబాబు నాయుడు ప్రభుత్వాలు చేపట్టిన మంచి పనులను ప్రజలకు వివరిస్తూ ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలని పార్టీ నాయకులకు సూచించారు. ప్రతి గ్రామంలో టిడిపి జెండాను ఎగురవేసి ప్రతి ఇంటికి వెళ్లి ఆడబిడ్డలకు బొట్టు పెట్టి తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు అట్లూరి సుబ్బారావు, రాష్ట్ర టిడిపి మీడియా కో-ఆర్డినేటర్ బియ్యాని సురేష్, పార్లమెంట్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు సుబాష్ యాదవ్, కృష్ణమాచారి, యాదగౌడ్, దుర్గా ప్రసాద్, గోపాల్ రెడ్డి, అశోక్ గౌడ్, సంజయ్, రాష్ట్ర నాయకులు ఆరీఫ్, విజి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోమటిరెడ్డిపై ఎఐసిసి గుర్రు

- కీలక సమయంలో అనుచిత వ్యాఖ్యలా?
- థాక్రేకు వివరణ... సంతృప్తి చెందని వైనం
- క్యాడర్ మనోధైర్యాన్ని దెబ్బతీశారంటూ ఆగ్రహం
- కోమటిరెడ్డి తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకున్నారు : మాణిక్‌రావు థాక్రే

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పొత్తులకు సంబంధించి ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలపై ఎఐసిసి సీరియస్ అయ్యింది. ఇలాంటి వ్యాఖ్యలు క్యాడర్ మనోధైర్యాన్ని దెబ్బతీశారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికల సమీపిస్తున్న కీలక తరుణంలో పార్టీపై అ సందర్భ వ్యాఖ్యలు చేయడం ద్వారా పార్టీని బలహీనపరచడమేనంటూ అసంతృప్తి వ్యక్తం చేసింది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు థాక్రేకు వివరణ ఇవ్వాలంటూ ఎఐసిసి ఆదేశించిన నేపథ్యంలో ఆయన భేటీ అయ్యారు. పొత్తులపై తాను ఉద్దేశపూర్వకంగా వ్యాఖ్యలు చేయలేదంటూ కోమటిరెడ్డి తెలిపారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లో బుధవారం ఉదయం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో థాక్రేను కలిశారు. కోమటిరెడ్డి వివరణపై ఎఐసిసికి థాక్రే నివేదిక ఇవ్వనున్నారు. ఇదిలా ఉండగా ఆయన చెప్పిన సమాధానానికి ఆయన సంతృప్తి చెందలేదని తెలిసింది. మరోవైపు కోమటిరెడ్డిపై పార్టీ నేతల విమర్శల పర్వం ఆగలేదు. రేవంత్‌రెడ్డి సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎసి గదుల్లో కూర్చొని పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైందికాదని పరోక్షంగా కోమటిరెడ్డిని హెచ్చరించారు. గత కొంత కాలంగా పార్టీని డామేజ్ చేయడం, బిజెపికి అనుకూలంగా వ్యాఖ్యలు చేయడంతో ఆయన పట్ల పార్టీలో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. థాక్రేను కలిసినంతరం ఎంపి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ భేటీలో తన వ్యాఖ్యలపై చర్చ జరగలేదని, తన మాటలను తప్పుగా ప్రచారం చేశారని తెలిపారు. అయితే ఆ వ్యాఖ్యలను థాక్రే పెద్దగా పట్టించుకోలేదన్నారు. తమ పార్టీ వాళ్లు ఆ వీడియో పూర్తిగా చూడలేదనీ, ఓ సర్వే రిపోర్ట్ వివరాలను మాత్రమే మాట్లాడానని వివరించారు. ఎన్నికలకు ఏవిధంగా సిద్ధం కావాలనే అంశాన్ని థాక్రేతో చర్చించినట్టు తెలిపారు. ముందస్తుగా టికెట్లు ఇవ్వాలని, గెలిచే వాళ్లకు టికెట్ ఇవ్వాలని కోరినట్టు వివరించారు. గతంలో ఆలస్యంగా టికెట్ల ప్రకటించడం వల్లే గోల్కొండ హోటల్‌లో గొడవలు జరిగాయని గుర్తు చేశారు. తెలుగుదేశంతో పొత్తు వద్దంటూ తాను ఆనాడు చెప్పానని ఈ సందర్భంగా తెలిపారు.

వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారు : థాక్రే

పార్టీపై వెంకట్‌రెడ్డి తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు థాక్రే తెలిపారు. ఆయన రాహుల్‌గాంధీ ఆదేశాలకు కట్టుబడి ఉన్నట్టు చెప్పారు. కాంగ్రెస్ నాయకులంతా ఐక్యంగా ఉన్నారని, త్వరలోనే పాదయాత్ర చేస్తారని వెల్లడించారు.

హాత్ సే హాత్ కార్యక్రమంపై థాక్రే సమీక్ష

హాత్ సే హాత్ యాత్రను విజయవంతం చేసేందుకు పిసిసి ఉపాధ్యక్షులతో మాణిక్‌రావు థాక్రే సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. హాత్ సే హాత్ అభియాన్ యాత్రను ప్రతి నియోజకవర్గంలో నిర్వహించాలని చెప్పారు. కాగా ఈ సమావేశానికి 34 మంది ఉపాధ్యక్షులు హాజరు కావాల్సి ఉండగా...కేవలం తొమ్మిది మంది మాత్రమే హాజరయ్యారు. పిసిసి ఉపాధ్యక్షుల గైర్హాజరుపై థాక్రే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎందుకు గైర్హాజరయ్యారనే దానిపై వివరణ అడగాలంటూ ఎఐసిసి కార్యక్రమాల అమలు కమిటీ ఛైర్మెన్ ఏలేటి మహేశ్వర్ రెడ్డికి సూచించారు. 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో పర్యటించి హాత్ సే హాత్ జోడో యాత్రలో పాల్గొంటానని చెప్పారు. పనితీరు బాగాలేకుంటే పార్లమెంట్ ఇంచార్జిలుగా ఉన్న వారిని మార్చాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎవరో చెప్పాలి : నిరంజన్

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత కూడా ఇంకా రిటర్నింగ్ అధికారిని ఎన్నికల సంఘం ప్రకటించలేదని పిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు జి నిరంజన్ విమర్శించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అభ్యర్థి నేరాల సమాచారం తెలిపేలా నిబంధన ఉందా?అని ప్రశ్నించారు. ఈ విషయాలపై అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.